

సీతాపతి కథ

బాలగంగాధర తిలక్

సీతాపతి తాపీగా కలం తీశాడు. ఒక తెల్ల కాగితం తీసుకున్నాడు. ఇటూ అటూ చూశాడు. ఎవరూ లేరు. సోఫాలో బొచ్చుకుక్క కళ్ళు మూసుకొని పడుకుని వుంది. గోడమీద గడియారమూ, గడియారం పక్కనే గాంధీగారి బొమ్మా నిర్మలంగా వున్నాయి. బల్లమీద వెండిగిన్నెలో కాఫీ చల్లారిపోతోంది. కాఫీ తాగి రాయనా, రాశాక తాగనా అన్న ఆలోచనతో ఓ నిముషం వుండిపోయాడు.

కనుబొమలు కుంచించి, పెదవులు బిగించి, కాఫీ తాగకుండానే కాగితం మీద యిలా రాశాడు.

"పెళ్ళాన్ని చంపెయ్యాలి."

అమ్మయ్య ! అనుకున్నాడు. స్తిమితంగా కలం టేబిలుమీద పెట్టి వెండిగిన్నె తీసుకుని కాఫీ ఓ గుక్క తాగాడు. అతనికి వొళ్ళు తేలికపడినట్టు అనిపించింది. ఆ ఆలోచన తన మనసులో వుండి తనని బరువుగా అస్తిమితంగా చేసి వేస్తోంది. ఇప్పుడా ఆలోచనని ఎత్తిపట్టుకుని నీట్‌గా కాగితం మీదకి దింపేశాడు.

ఆలోచన వృత్తిసే మనస్సులో వుంటే పాదరసంలా పరుగెడుతుంది. కంగారు పెడుతుంది. రూపమూ గుణమూ ఉండవు ఆలోచనకి. ఇప్పుడు కాగితం మీద అక్షర రూపం దాల్చేటప్పటికి ఆలోచనకి ఒక మూర్తీ ఒక ప్రాణమూ ఒక వ్యక్తిత్వమూ వచ్చినట్టు అనిపించింది.

మళ్ళీ ఓ గుక్క తాగాడు. కాగితం మీద మళ్ళీ యిలా రాశాడు.

"బొచ్చుకుక్కని చంపెయ్యాలి."

కొంచెం నవ్వుకున్నాడు. తను కొంచెమే నవ్వుకున్నట్టు తెలుసుకొని తిరిగీ నవ్వుకున్నాడు. కాఫీ తాగడం పూర్తయేసరికి కాగితంమీద అతని ఆలోచనలు ఇలా వ్రాయబడి వున్నాయి.

"పెళ్ళాన్ని చంపెయ్యాలి.

బొచ్చుకుక్కని చంపెయ్యాలి.

పోస్టు మాన్‌ని చంపెయ్యాలి.

డాక్టర్ని చంపెయ్యాలి.

పక్కింట్లో వాళ్ళ అబ్బాయిని చంపెయ్యాలి."

సీతాపతి సంతృప్తిగా పడక కుర్చీలో వెన్నువాల్చాడు. ఇటువంటి ముఖ్యమైన అయిదు హత్యలను చేసే గురుతర బాధ్యత తనమీద పెట్టుకున్నాడు. సీతాపతి పనిలేని వాడనీ, చాతకాని వాడనీ యింకెవరూ అనుకోరు. పేపర్లో, సినీమాహాళ్ళలో, శృంగాటకాలలో తనని గురించే చెప్పుకుంటారు. "అడుగో వాడే సీతాపతి." అంటూ ఆడవాళ్ళు కిటికీలలోంచి చూసి భయంగా గుసగుస లాడుతారు. మళ్ళీ నవ్వుకున్నాడు.

మనిషి అన్నవాడికి సాహసం వుండాలి. ధైర్యం వుండాలి. కత్తిలా దూసుకుపోవాలి. గుచ్చుకుపోవాలి.

"కాఫీ తాగారా ?"— సన్నని మృదు

మైన కంఠస్వరం గుమ్మంలో తెరవెనుక నుండి.

ఉలిక్కిపడ్డాడు సీతాపతి. తానింకా ప్రథమ కార్యక్రమం అయిన భార్యా హననాన్ని కొనసాగించనేలేదు. ఆమె బతికే వుంది. గుమ్మం తెర చాటునవుంది. భౌతికమైన ఖచ్చితమైన యథార్థమైవుంది. తాను వూరికే ఉత్తి ఆలోచనకే తృప్తిపడి పోతున్నాడు. గర్వపడిపోతున్నాడు.

“అయితే స్నానానికి లేవండి. వేణ్ణీళ్ళు తోలిపి పెట్టాను.”

“అబ్బ! బద్ధకంగా వుందే-”అన్నాడు విసుగ్గా. తన బతుకే ఒక విసుగు, ఒక అర్థంలేని పిచ్చిగీత.

తెర తొలగించుకుని “పోనీ టానిక్కు యివ్వనా. స్నానం తర్వాత చేద్దురుగాని లెండి.” అందామె.

సోఫాలో పడుకుని వున్న బొచ్చుకుక్క వైపు చూశాడు—దీనంగా. తన భార్య తననీ ఆ బొచ్చుకుక్కనీ ఒకలాగే పెంచుతోంది. తనకి యిష్టా యిష్టాలు లేవు. వ్యక్తిత్వంలేదు. తన మనస్సునీ శరీరాన్నీ ఆమె ఎప్పుడో వప్పగించేసుకుంది. తనకి విముక్తి లేదు. బొచ్చుకుక్కకీలేదు. కుక్కని చూస్తూన్నకొలదీ తనకి తనే జ్ఞాపకం వస్తాడు. అందుకే తన ఆలోచనలలో రెండవ హత్యకి బొచ్చుకుక్కని లక్ష్యం చేశాడు.

“ఇదిగో తాగండి.” పద్మావతి మృదువుగా మందు గ్లాసు నోటిదగ్గర పెట్టింది. లాలనగా తియ్యగా కళ్ళల్లోకి చూసింది. అందులోనూ అందమైన పద్మాలలాంటి కళ్ళతో. సింపిల్‌గా నాజూకుగా టాయిలెట్ అయి, దుస్తులు వేసుకున్న ఆమె వొంటి మీదనుండి యు డి. కలోన్ వాసన సుతారంగా వస్తోంది. ఇక్కడే వచ్చింది గటి చిక్కు. తన భార్య అసహ్యంగా లావు వుండకూడదూ? వెకిరికి. వెర్రిదీ కాకూడదూ? అప్పుడు తనకి భర్తగా ఒక ప్రావఖ్యం అయినా వుండేది. దేవుడు తనమీద కసికొలదీ ఆమెని అందంగా, పొడుగ్గా చేశాడు. తియ్యగా, హాయిగా మాట్లాడుతుంది. అందరికీ పద్మఅంటే యిష్టం. ఎవరికిష్టంకాదు. పువ్వులతోవున్న పున్నాగ చెట్టూ, నగిషీల దంతపు గిన్నెలోవున్న అగరువత్తుల గుత్తి, నక్షత్రాలతో మెరుస్తూన్న శరదాకాశమూ?

మందు తాగాడు. తన జుట్టులోకి వేళ్ళు పోనిస్తూ అంది పద్మ. “వేణ్ణీళ్ళు కాగులో కాగుతూ వుంటాయి. పదిగంటలకి స్నానం చేస్తారా చెప్పండి? ఈలోగా లైఫ్‌పత్రిక చదువుకోండి ఏం?”

ఏ పత్రిక ఎప్పుడు చదవాలో కూడా పద్మ చెపుతుంది. చదివిస్తుంది. ఏం - తాను మాంచి డిటెక్టివ్ నవల చదవకూడదా? పద్మ లైఫ్ పత్రిక అతని చేతికిచ్చింది. విసుగ్గా అంది పుచ్చుకున్నాడు.

“టొమాటో పెరుగుపచ్చడి. ములక్కాడ సాంబారూ చేయిస్తున్నాను. ఇష్టమే కదూ.” అంది పద్మ.

ఎటువంటి బానిస అయినా చరిత్రలో తిరగబడిన ఘట్టాలున్నాయి. చరిత్ర చదివాడు సీతాపతి. స్వాతంత్ర్యం కోసం ప్రాణాలిచ్చిన మహామహులున్నారు, తాను మాత్రం!

నాకు టొమాటో వద్దు” అన్నాడు ధైర్యం చేసి.

“మరేం కావాలి?”

“గోంగూర పచ్చడి.”

“గోంగూర పైత్యం. మీ వొంటికసలు పడదు. డాక్టరేమన్నాడో మరచిపోయారా? అదీకాక టొమాటోలో కాలరీలు వుంటాయి. ఏం, నా బాబుకదూ” గడ్డం పట్టుకుని గోముగా అడిగింది పద్మ.

నేను అన్నమే తినను. విషం మింగి చస్తాను—అని అందామనుకున్నాడు సీతాపతి. కాని పద్మ అంతలో వెళ్ళిపోయింది. బానిస నోరు మూసేసుకోవాలి. లైఫ్‌పత్రిక చదవాలి. టొమాటోలు తినాలి. తప్పదు. రాజ శాసనం.

నీరసంగా వెనక్కి వాలిపోయాడు సీతాపతి. తనకి వివాహం అయిన దుర్ముహూర్తాన్ని నిందించుకున్నాడు. పట్టభద్రుడై, ఆస్తిలేక ఉద్యోగం లేక నా అన్న వాళ్ళు లేక (పెంచిన మేనమామ తప్పించి) ఉన్న తనని చూసి వరించి వలచి పెళ్ళి చేసుకుంది పద్మ. పాతిక ఎకరాల ఆస్తితో పెద్ద మేడతో వచ్చింది. ఇదిగాక యింకో ముప్పైవేలు ఆమె పేర బ్యాంకిలో ఉన్నాయి. తను అనుభవించే డబ్బూ తిండీ పద్మవి. ఎప్పుడేనా తనని నీచంగా, లోకువగా చూస్తుందేమో, తన నిరుద్యోగాన్ని హేళన చేస్తుందేమో—సాకుగా తీసుకొని దెబ్బలాడి తన అధికారాన్ని నిరూపించుకోవచ్చుననుకున్నాడు. కాని పద్మ ఏనాడూ పల్లెత్తుమాట అనలేదు. పైగా మీరే నా సర్వస్వం అంటుంది. ఆ యింట్లో అలా తింటూ తానుండడమే ఓ మహద్భాగ్యంగా ప్రవర్తిస్తుంది.

“పోనీ పొలంవెళ్ళి మక్తాలు వసూలు చేసుకురానా” అన్నాడొకసారి తనవల్ల ప్రయోజనం ఉందని తనని తానే నమ్మించుకోవాలని.

“మీరా!” పద్మ నవ్వింది. ఆ నవ్వు అలాగ ఆడవాళ్ళే నవ్వగలరు. ఆ నవ్వులో ఆరుగురు ఆనంద వర్ధనుల ధ్వన్యాలోకాలు ప్రతిధ్వనించాయి.

“ఏం - ఆమాత్రం చాతకాదా నాకు?” అన్నాడు కోపంగా.

“ఎండలోపడి పొలాలమ్మట ఏం తిరిగి రాగలరు చెప్పండి. అసలే మీరు సుకుమారులాయిరి....పాత బకాయీలుంటాయి. పైగా రైతులు పండలేదనీ ఏదో యిబ్బంది వచ్చిందనీ ఏవేవో చెపుతారు. నిజా నిజాలు

చిక్కు-ప్రశ్న

“కారు అమితవేగంగా పోతున్నది. రోడ్డు పక్కనగాని, కారుకు గాని దీపాలు లేవు. ఎదురుగా నల్లని మనిషి, పూర్తిగా నల్లని దుస్తులలో వస్తున్నాడు. అతన్ని చూడగానే డ్రైవరు సడెన్ బ్రేకువేసి కారు ఆపేశాడు. డ్రైవరు ఎలా చూడగలిగాడో చెప్పగలవా?”

“తెలియదు. ఎలా?”

“ఏం లేదు. అది అట్టపగలే జరిగింది.”

—“సురేఖ”, రాజమండ్రి.

గ్రహించకలిగి వుండాలి. అవసరమైతే బెదరించాలి. కొత్త రైతులకి భూములు మానుస్తామనాలి....గోవిందయ్య అనుభవం ఉన్నవాడు. నమ్మకమైనవాడు...."

పద్మ చెప్పుకు పోతూంటే సీతాపతి యింక వినలేకపోయాడు. గోవిందయ్య అంటే గుమాస్తా. నొసటిమీద నామాలూ, భుజంమీద గళ్ళ తువ్వాలూ, చంకలో గొడుగూతో ప్రత్యక్షమయ్యే నడివయస్సు దాటిన యీ గుమాస్తా తనకన్న తెలివైనవాడా ? నమ్మకమైనవాడా ? తన ప్రశ్నల్ని బాధల్ని మాట్లాడకుండా నమిలి మింగేసి ఊరుకున్నాడు సీతాపతి.

మక్తాలు పద్మ వసూలు చేయిస్తుంది. పన్నులు ఆమె కట్టిస్తుంది. కూరలు ఆమె కొంటుంది. ఒక గుమాస్తా, ఒక పాలేరూ ఒక వంటావిడా ఆమె సిబ్బందీ. జమా ఖర్చు ఆవిడ చూసుకుంటుంది. రాత్రి పడుకోబోయేముందు ఇంటి తలుపులన్నీ వేసి ఉన్నాయో లేదో ఆమె చూసుకుంటుంది. తనకి క్లబ్‌లో మెంబరు షిప్పుకి నెల నెలా రెండు రూపాయలు క్లబ్బు కుర్రాడికి ఆమె యిస్తుంది. తను క్లబ్బుకి వెళుతూంటే పేకాడవద్దనీ, అంతగా ఆడితే బ్రిడ్జిలాంటి గేమ్, తక్కువ స్టేక్సుతో వేసుకోమనీ ఓ పదో యిరవయ్యో తన జేబులో పెడుతుంది. తనమందులు ఆమె కొంటుంది. తన ఆరోగ్యాన్ని ఆమె రక్షిస్తుంది. తన అవసరాన్ని ఆమె నిర్ణయిస్తుంది.

తనకి పనిలేదు. బాధ్యతలేదు. తనకి అస్తిత్వంలేదు.

ఒకరోజున దెబ్బలాడి తన ఉనికి స్థిరపరచుకోవా లనుకున్నాడు. క్లబ్బునుండి ఆలస్యంగా రావాలనే వచ్చి, వక్కపొడి నముల్తూ మంచంమీద పత్రికని తిరగేస్తూ కులాసాగా కనపడిన భార్యని చూశాడు.

"నేను రాకుండా అన్నం తినేసి కూర్చున్నావు. నేనంటే కొంచెమైనా విలువ ఉందా నీకు ? ఈ యిల్లు నీది, భూమినీదీ....నేనెవణ్ణి ఉత్తి బానిసని....వెధవని....నా కొక గౌరవమూ గొప్పా యీ యింట్లో...." కోపంతో గట్టిగా అరిచాడు.

"ఎవరు చెప్పారండీ మీకు. ఈ వేళ శనివారం. నేను భోంచెయ్యనని మీకు తెలుసుగా" అంది పద్మ భర్త కేసి ఆత్రుతగా జాలిగా చూస్తూ.

అతని ప్లానంతా వృథా అయిపోయింది. శనివారం మాట మరచిపోయి ఫూల్ అయిపోయాడు. అయినా ఊరుకోలేదు సీతాపతి.

"అలా జాలిగా మాట్లాడుతావేం ? నేను అనాథ ననుకున్నావా, మతిలేని వాడి ననుకున్నావా ?"

"అ[illegible]తి. మీరు కోపంతో కేకలు వేస్తూంటే. మీ డైజషన్ అసలే మంచిది కాదు. డాక్టరు చెప్పాడు. జీర్ణశక్తి పాడైపోయినప్పుడల్లా కారణం లేకపోయినా ఫిట్సులాగ యిలాగ కోపం, చిరాకూ వస్తూంటాయని. ఉద్రేకం అసలు పనికి రాదన్నాడు. ఇలాగ మీరు అలిసిపోతే ఎలాగ చెప్పండి. పోనీ. పళ్ళరసం, గ్లూకోజూ కలిపి యివ్వనా. సత్తువ చేస్తుంది."

ఓడిపోయాడు సీతాపతి. ఆమెకి కోపం రాదు. మరి రెచ్చిపోయాడు సీతాపతి. టేబిలుమీద వున్న రాధాకృష్ణ విగ్రహం పట్టుకొని నేలకేసి కొట్టాడు. రాధా కృష్ణుడూ ముక్కలు ముక్కలై వియోగం పొందారు.

ఆమె బెదరిపోయింది. భర్త మానసిక స్థితి ఆమెకి ఆందోళన కలిగించింది. అయినా అంతలోనే నవ్వింది.

"ఆ బొమ్మంటే మీకిష్టం లేదని తెలిసీ కూడా కొనడం నాదే పొరపాటు. పోనీ బొమ్మ బద్దలైనంత మాత్రాన వచ్చిన నష్టం ఏంవిటి. ఈసారి మీకు నచ్చినదే కొంటాను" అంది.

సీతాపతి గదిలోకి వెళ్ళిపోయాడు. జుట్టు పీక్కున్నాడు. ఆత్మహత్య చేసుకుందామనుకున్నాడు. అనుకుంటూనే నిద్రపోయాడు. ఆమెవచ్చి కాశ్మీర శాలువ కప్పడమూ, కాళ్ళు వొత్తడమూ అతను నిద్రలోకూడా అలవోకగా గుర్తించాడు.

మధ్యాహ్నం భోజనంచేసి తను మంచం మీద వాలగానే వస్తాడు పక్కింటి వాళ్ళ అబ్బాయి. వాడిపేరు రవి. గుర్రపు జూలు లాంటి జుట్టు కళ్ళమీద పడుతూంటుంది. సన్నని పెదాలు హేళన చేస్తూన్నట్టుగా వుంటాయి. చిన్న లోతైన కళ్లు—తుపాకీ గుళ్ళలా వొంట్లోకి గుచ్చుకుంటాయి. తీరికగా, బద్ధకంగా, రాజకుమారుడిలా వస్తాడు, ఇటూ అటూ చూస్తూ, తన మీద సూపర్వైజింగ్ ఆఫీసర్‌లాగ వచ్చి "హి హి హి" అని పెదవులు మూసి నవ్వుతాడు. నవ్వి "మా అమ్మ నన్ను తిట్టింది" అంటాడు.

"ఏం" అడిగాడు సీతాపతి "ఏంవనీ ?"

"పనీ, పాటాలేకుండా పద్మమ్మ మొగుడిలా తయారవుతున్నావు వెధవా" అంది అన్నాడు సిచోపమకి బాధపడుతున్నట్టుగా. సీతాపతి కోపంతో "నిద్రవస్తోంది. వెళ్ళు" అన్నాడు.

రవి అక్కడున్న [illegible]ఫ్ పత్రిక తీసి బొమ్మలు చూస్తూ "అస్తమానూ నిద్దరేనా. నిజంగా మీకు పనీ పాటా ఏం లేదా" అన్నాడు.

సీతాపతికి అక్కడున్న సిరాబుడ్డీ విసిరి కొట్టాలనిపించింది. "నీకెందుకు. పో కిందకి" అన్నాడు.

"పద్మత్త మీరు నిద్రపోకుండా చూస్తూండమని చెప్పింది. మీ డైజషన్ బాగాలేదట కదూ."

వొళ్ళు మండి మరోవైపు తిరిగి పడుకున్నాడు సీతాపతి. రవి లేచి యిటూ అటూ తిరిగి "రోజూ నడవకూడదూ మీరు ; అన్నం అరుగుతుంది. మా సైన్సు వాచకంలో వాకింగ్ చాలా మంచిదని రాశారు" అన్నాడు.

సీతాపతి జవాబివ్వలేదు. ఈ కుర్ర వెధవకి తనంత లోకువ ఎందుకైపోయానా అనుకున్నాడు.

"మీకు ఉద్యోగం ఎవరూ యివ్వరాండీ. మీకు చాతకాదా ?"

"విసిగించకు. పో" అని గట్టిగా అన్నాడు సీతాపతి. మామూలుగా అడిగితే అంత బాధ లేకపోను. కాని వీడు అడగడంలో, ఆ గొంతులో, ఆ మాటల్ని మెల్లగా వెడల్పుగా ఉచ్చరించడంలో ఒక

అవహేళన. భరించరాని అసహ్యం ఉన్నాయి.

"మేం రోజూ చెడుగుడు ఆడుకుంటాం. మీరుకూడా వచ్చి ఆడకూడదూ."

సీతాపతి కోపం పట్టలేక మంచంమీద నుంచి దూకడమూ, రవి పారిపోవడమూ ఒకేసారి జరిగాయి.

రవి వచ్చినప్పుడల్లా యీ మాటలే యీ



సీతాపతి కోపంగా చూసి "హుఁ" అన్నాడు.

మళ్ళీ బల్లినవ్వినట్టు నవ్వి "అదీ రాదా. షేమ్ షేమ్" అన్నాడు రవి.

సంఘటనలే పాఠాంతరాలు పొంది ప్రదర్శిత మవుతూంటాయి. మెట్లమీద వాడి అడుగుల చప్పుడు వినపడగానే సీతాపతి హాళ్ళ భయంతో, అసహ్యంతో ముడు

చుకుపోయింది. వాడు తన మేడ పిట్టగోడ నానుకుని నుంచున్నప్పుడు వెనకాలే వెళ్ళి అమాంతం వాడి రెండుకాళ్ళూ ఎత్తి కిందకి పడవెయ్యాలన్న ఉబలాటాన్ని ఎంతో కష్టంమీద అణచుకొన్నాడు సీతాపతి.

మధ్యాహ్నం కునుకుతీసి లేవగానే పోస్టుమాన్ కేక వినపడుతుంది. సీతాపతి గబగబా మెట్లు దిగుతాడు. అప్పటికే పద్మ కూడా గుమ్మందగ్గరకు వచ్చి నిలుచుంటుంది.

పోస్టుమాన్ సీతాపతిని చూసి నవ్వి "మీకేమీ లేవండి సార్. అన్నీ అమ్మగారికే." అంటూ ఓ దొంతర ఆమెకిస్తాడు.

పద్మ వాలిపోయిన సీతాపతి మొహాన్ని చూసి "అదేమిటోయ్. ఆయన్ని బట్టి గదా నాకీ ఉత్తరాలు వచ్చేది? నే నాయన సెక్రటరీని." అంటుంది.

"ఆయనకేం మహరాజు. హాయిగా తిని పడుకుంటే దొరలా వెళ్ళిపోతుంది. మా దొడ్డ జాతకంలెండి అయ్యగారిది." అని పోస్టుమాన్ చిరునవ్వుతో వెళ్ళిపోతాడు.

అతనెంత మంచి మనస్సుతో అన్నా ఆ మాటలన్నీ ఈటెలై సీతాపతి అభిమానపు గుండెలో గుచ్చుకుంటాయి. గబగబా లోపలికివెళ్ళి సోఫాలో దిగులుగా కూర్చుంటాడు. పద్మ బెదరుగా మెల్లగా లోపలికి వచ్చి "ఏమండీ. వీటికి జవాబులు రాసిపెట్టకూడదూ" అంటుంది అతన్ని సంతోష పరుద్దామని.

"నేను రాయను. రాయాల్సిన అవసరం నాకేమీలేదు. అసలు ఆ ఉత్తరాలెందుకో, సంగతి సందర్భాలేమిటో నాకేం తెలుస్తుంది?" అంటాడు పెడసరంగా సీతాపతి.

అతని కెవరూ ఎందుకు ఉత్తరాలు వ్రాయరో అతనికి అంతు పట్టదు. తాను వ్రాసిన ఉత్తరాలకికూడా భార్యపేర జవాబు వస్తుంది. కర్మ! "మీ ఆయన కోరిన పుస్తకం యీవూళ్లో లైబ్రరీలోకాని, బుక్ స్టాల్‌లోకాని లేదుఅని చెప్పవలసింది."—ఇలా వుంటాయి ఆ జవాబులు. ఏడాది పొడుగునా అతనెంతమందికి ఎన్ని ఉత్తరాలు వ్రాసినా, ఒక్క యిన్సూ్యరెన్సు కంపెనీ వాళ్ళు మినహా అతనిపేరు వ్రాయరు.

ఓసారి పద్మ వచ్చే ఎన్నికలని తలచుకొని "ఏమండీ మీరు ఓటెవరికి వేస్తారు" అంది.

"నాకు ఓటు వుండదు" అన్నాడు మూతి బిగించి సీతాపతి.

"ఏం?"

"నేను మైనరుని. కేరాఫ్ పద్మాదేవి గాడిని."

ఫక్కున నవ్వింది పద్మ. అతన్ని వక్షానికి అదుముకొని "ఛ—అలాగ అనొచ్చునా. మిమ్మల్నిబట్టి గదా నాకున్న విలువా, పలుకుబడీ. ఉదయం నుండి రాత్రి వరకూ ఇన్నిపనులు చూసుకో కలుగుతున్నానంటే అదంతా మీరిచ్చిన బలమే కదా!" అంది.

ఆమె కళ్ళల్లో మెత్తని వెలుతురు తడి తడి నేలమీద నీరెండలా మెరిసింది. కాని సీతాపతి అదేమీ గమనించలేదు. ఆ మాటలలోని అర్థమూ, వాటితో వ్యక్తమైన

(11)

అపారప్రేమా అతను తెలుసుకొనే స్థితిలో లేడు. విద్రోహబుద్ధితో నిండిపోయింది సీతాపతి మనస్సు. అరబ్ దేశాలలో అర్ధరాత్రికి అర్ధరాత్రి coup (కూప్) జరిపే సేనానాయకుల ప్రవృత్తి అతనిలో భీకరంగా ప్రబలిపోయింది.

అతను కోరినవి తినేందుకు వీల్లేదు. డాక్టరు నిషేధం వుంది. అతని దినచర్య అతని వశంలో లేదు. డాక్టరు అంతా ఏర్పరచి వుంచాడు. దాన్ని తూచా తప్పకుండా పద్మ అమలు జరుపుతుంది. అతనికి తనకేమీ రోగం లేదని గట్టినమ్మకం. కాని పద్మకి నమ్మకం లేదు. అజీర్ణంకాని అస్వస్థతకాని ఏమైనా వుంటే నిర్వ్యాపారత్వం వల్ల కలిగిన ఫలితం మాత్రమే అని అతని ఉద్దేశ్యం. దేశంలో, ఖండాంతరాలలో వ్యాపించే రోగాలన్నీ కూడబలుక్కుని అమాయకుడైన, అందగాడైన తనభర్త దేహంలోకి ప్రవేశిస్తాయేమో అని ఆమె హమేషా కాపలా కాస్తూంటుంది.

ఓసారి అతను క్లబ్బు మిత్రులతో కలకత్తా షికారు వెళ్ళిరావాలి అనుకున్నాడు. ఎంతో ఉత్సాహంతో పద్మతో చెప్పాడు. పద్మ మొహం వెల వెల బోయింది. డాక్టర్ని పిలిపించింది.

"మీ ఆయనకి విశ్రాంతి అవసరం— ఇలాగ ఎండలో ప్రయాణం చేయడం మంచిదికాదు." అన్నాడు డాక్టరు.

సీతాపతికి వొళ్ళు మండిపోయింది. తనకి ఉన్నదే విశ్రాంతి: ఆ విశ్రాంతి బరువుకింద అతను నలిగిపోతున్నాడు. వ్యంగ్యంగా, మంటగా యిలా అన్నాడు.

"డాక్టర్. చేతనత్వం లేకండా వుంటే విశ్రాంతి బాగా లభిస్తుంది. అలా మార్చివెయ్యండి గట్టిమందిచ్చి. మీకూ పద్మకీ కూడా విశ్రాంతి వస్తుంది."

డాక్టరు చనువుగా తెలివిగా నవ్వాడు. "అమ్మాయ్. చూశావా చిరాకు. Nerves: Nerves:— నాకు నీమీద కక్ష ఏముందోయ్ సీతాపతి. అంతగా వెళ్ళాలని వుంటే, అమ్మాయినికూడా తోడు తీసుకువెళ్ళు. ఇవీ అవీ తింటూంటే ప్రయాణంలో చటుక్కున ఏ డయాబిటిస్ లోకో, గాస్ట్రిక్ట్రబుల్ లోకో దింపుతుంది. మన జాగ్రత్తలో మనం వుండాలి. దేశానికీ దేహానికీ ఎప్పుడూ గట్టి డిఫెన్సు వుండాలి." అన్నాడాయన. పద్మకి పదేళ్ళనుండి ఫామిలీ డాక్టరాయన. వయస్సు అరవైదాటడం వలన ఆయన అనుభవజ్ఞుడనీ ఆయన చెప్పిన మాటలకి ప్రత్యేక విలువ ఉందనీ పద్మ నమ్మకం.

తాను మిత్రులతో కూడా కలకత్తా సరదాగా వెళ్ళిరావాలని అనుకుంటూవుంటే భార్యనికూడా తోడు తీసుకు వెళ్ళమన్న డాక్టరు సలహాలోని అవమానమూ, అవహేళనా సూదులు గుచ్చినట్టు బాధించింది సీతాపతిని. అసలు ఈ డాక్టరూ పద్మా కలసి ఏదో కుట్ర చేసి, ముందుగానే పెళ్ళి కాకముందే—నిషేధాలపట్టీ తయారుచేసి—తనమీద ప్రయోగించి తనని అస్వతంత్రుడినీ, అసహాయుడినీ చేసేస్తున్నారని గట్టి శంక కలిగింది సీతాపతికి. ఈ డాక్టర్ని, వృద్ధజంబుకాన్ని — కడతేరిస్తేకాని తన వొళ్ళూ తన మనసూ తనదికాదని నిశ్చయం చేసేసుకున్నాడు.

శ్రీశ్రీ ఉవాచ

ఒక సినిమా నిర్మాత "కథలో" అని గోలెత్తి పోతుంటే వెంటనే కంచికి వెళ్ళమని సలహా చెప్పారట శ్రీశ్రీ.

"ఎందుకూ?"

"మన ప్రతికథా కంచికే వెళ్ళిపోయి, అక్కడ స్థిరపడుతున్నాయి. మీరు వెడితే అవన్నీ అక్కడ కొల్లలుగా దొరకచ్చు."

—సుకుమార్.

2

కమ్యూనిజం యొక్క సిద్ధాంతాలు తెలిసిన వాళ్ళకి తెలుస్తుంది. Exploitation — అంటే పరపీడన — అంటే ఏమిటో, చావకుండా బ్రతకకుండా అభ్యుదయమార్గాన్ని నిరోధించడం ఈ పరపీడన సాధనాల్లో ఒకటి. పద్మ ఓవేళ మార్క్సిజం క్షుణ్ణంగా చదివి, దాని నిజా నిజాలు తనమీద ప్రయోగాత్మకంగా రుజువు చేసుకుంటోందా అని సందేహించాడు. అయితే అతనూ నాలుగూ చదువుకున్న వాడూ, నేర్చుకున్నవాడూనూ. ధనిక వాదుల్నీ, సామ్రాజ్య వాదుల్నీ మంచితనం ద్వారా మనసు మార్చలేమని మార్క్సు తెగేసి చెప్పాడు. దీనికి విప్లవమూ, హింసాయుతమైన తిరుగుబాటు ఒకటే మార్గం.

అందుకే సాహసుడైన సీతాపతి అయిదు హత్యల్ని చేయాలని సంకల్పించాడు. కాని ఏ ఒక్కటీ కూడా చేయలేకపోయాడు. ఇందుకు పిరికితనం మాత్రం కారణం కాదు. రేగిన ముంగురులతో, సోగ కళ్ళతో ఎర్రని రెండు చిన్ని పెదవులతో 'ఏఁవండీ' అని ఎంతో ముద్దుగా పిలిచే లాలించే భార్యని, మీదికురికి, మెడ వాటేసుకుని, పీక గబుక్కున నొక్కి ఠపీమని చంపివెయ్యడం మరీ ఘోరంగానూ భారతీయ సంప్రదాయానికి సంపూర్ణ విరుద్ధంగానూ అనిపించింది. అందులో పద్మవంటి పద్మాన్నీ ఏ కఠోరహస్తం అయినా నలిపి రేకుల్ని తెంపి పారవెయ్య గలదా?

ఈ సమస్యా పరిష్కారం మార్క్సిజంలో లేదని గ్రహించేశాడు సీతాపతి. ఒక్క గాంధీజం ఒక్కటే అటువంటి క్లిష్ట పరిస్థితిలో దారి చూపించగలదు. భారతదేశం ధర్మాన్ని విడిచిపెట్టితే తాను భారతదేశాన్నే విడిచిపెట్టి వెళ్ళిపోతానన్నాడు గాంధీజీ. ఇదే మార్గం ఇప్పుడనుసరణీయంగా తోచింది సీతాపతికి. పద్మనీ, పద్మయిచ్చే సౌఖ్యాన్నీ, భోగాల్నీ, భద్రతనీ విడిచి తన వ్యక్తిస్వాతంత్ర్య రక్షణార్థమై వెళ్ళిపోవాలనుకున్నాడు.

ఆషాఢ శుద్ధ ఏకాదశీ సోమవారం నాటి సాయంత్రం పద్మతో క్లబ్బుకి వెళుతున్నానని చెప్పి తిన్నగా రైలు స్టేషనుకి వెళ్ళిపోయాడు సీతాపతి. అంతకుముందు రోజున భార్య తనజేబులో పెట్టిన పది రూపాయల నోటు ఒక్కటే వుంది సీతాపతి దగ్గర. ఏవూరు వెళ్ళాలో ష్ఘుండే ఆలోచించుకున్నాడు. పెళ్ళి కాకముందు విద్యానంతరం. తన సహాధ్యాయుడైన రామ

కోటితో కలసి అతనివూరు వెళ్ళాడు. ఎంతో అందమైన వూరది! పెద్ద చెరువూ కొబ్బరితోటలూ, అరటి తోటలూ, స్వచ్ఛమైన పుష్కలమైన గాలీ, ఆ గాలిలాంటి సుఖమైన మనుష్యులూ, పెద్ద కోవెలా, కోవెల నానుకుని వున్న సత్రమూ—ఆ వూళ్ళో ప్రశాంతంగా తన శేష జీవితం గడపాలనుకున్నాడు. రామకోటి ఆ నాడన్నాడు యిలాగ. "ఒరేయ్ సీతాపతీ. ఏదేనా వుద్యోగం దొరికే వరకూ యీ వూళ్ళో వుండి ట్యూషన్లు చెప్పుకోరాదూ. దగ్గర్లో హైస్కూలూ, కాలేజీ లేవు. ఎందరో ధనికుల బిడ్డలు మెట్రిక్‌కీ బెనారస్ పరీక్షలకీ, ప్రైవేటుగా కట్టాలని వుబలాట పడుతున్నారు. నెలకి రెండువందలు దొరుకుతాయి, నీకు శ్రద్ధవుంటే."

ఇప్పుడైనా తానక్కడ ఆ వూళ్ళో ట్యూషన్లు చెప్పుకొని సుఖంగా జీవించవచ్చు ననుకున్నాడు. రామకోటి ధనవంతుడూ, పలుకుబడి గలవాడూ కూడా. ఈ ఏడెన్మిదేళ్ళల్లోనూ ఆ గ్రామంలో హైస్కూలు వెలిసే దుర్యోగం పట్టి వుండదు. ఆవూళ్లో తనని కాని, తన భార్యని కాని ఎరిగున్న వాళ్ళు లేరు. కాబట్టి తన ఉనికి ప్రసారమయ్యే వీలుండదు. అజ్ఞాతంగా, హాయిగా బతకొచ్చును అని అనుకున్నాడు సీతాపతి.

ఎటొచ్చీ ఆ వూరు రైలు స్టేషనుకి దగ్గర్లో లేదు. ఫలానా స్టేషన్‌లో దిగి కాలి నడకనో, బండిమీదనో నాల్గు మైళ్ళు వెళ్ళితే కాని ఆవూరు చేరుకోలేడు. అయితేనేం- రాత్రి పదిగంటలకి ఆవూరు చేరుకుని రామకోటి యింటో హాయిగా పడుకుని......

సీతాపతి మనస్సు చివుక్కుమంది. తను యింట్లో లేకపోవడం, యింటికి రాకపోవడం చూసి పద్మ ఎంత బేజారైపోతుందో, సోగలైన ఆమె కళ్ళనుండి నిరంతరధారగా కన్నీరు కారుతూండగా కిటికీ లోంచి వీధి వైపు తనకోసం రాత్రంతా చూస్తూ నిట్టూర్పులు విడుస్తూ ఉంటుందో తలచుకునేటప్పటికి ఏదో బాధ కలిగింది. వెనక్కి వెళ్ళిపోదామా అనుకున్నాడు ఓ క్షణం. కాని యింతలో హరిశ్చంద్రుడూ, రామచంద్రుడూ, బుద్ధుడూ మొదలైన భార్యల్ని అమ్మేసిన, వదిలేసిన, విడిచేసిన—ఆర్య వీరులందరూ జ్ఞాపకం వొచ్చి అతన్ని కర్తవ్యపరుణ్ణి చేశారు.

రైలు వేగంగా వెళ్ళిపోతోంది. కొత్తగా సంపాదించుకున్న స్వేచ్ఛతో అతనికి రైల్లో మనుష్యులూ ఇటూ అటూ, పొలాలూ, కొండలూ అన్నీ కొత్తగా ఉత్సాహంగా అనిపించాయి. మందు తీసుకోమనీ, కందిపచ్చడి తినకూడదనీ, రాత్రి పది దాటాక మేలుకోకూడదనీ,—ఇలాగ అడుగడుక్కీ అడ్డంకులు, నిషేధాలు లేని స్వర్గంలోకి సజీవంగా ఎగిరిపోతూన్నట్టు అనిపించింది సీతాపతికి. చల్లనిగాలి వొంటికి తగిలింది. ఏమిటా అని ఆకాశంకేసి చూశాడు. మబ్బులు నల్ల నల్లగా, దొంతర్లుగా క్రమ్ముకుంటున్నాయి. గాలి వేగం హెచ్చింది. కోపన అయిన ప్రియురాలు చెంపమీద విసురుగా కొట్టినట్టుగా మొహానికి చురుకుగా తగులుతోంది చల్లగాలి. భావుకుడైన సీతాపతి మనస్సు ఆనందంతో

ఆలోచనలతో నిండిపోయింది.

రాత్రి ఎనిమిది గంటలకి ఆగవలసిన స్టేషన్‌లో ఆగింది రైలు. ఊహాలోకం లోంచి చటుక్కున విడివడి సీతాపతి రైలు దిగేటప్పటికి కాని అతనికి వర్షం కురుస్తోన్నట్టు తెలియలేదు. ఆషాఢ మాసంలో మేఘాలు మేఘాల్లా వుండిపోక వర్షం అనే రూపాంతరం పొందుతాయన్న సంగతి అతను యిందాకటి ఉత్సాహంలో మరిచిపోయాడు. స్టేషన్ దాటి వచ్చేసరికి ఉన్న ఒకటి రెండు బళ్ళని ఆడవాళ్ళతో దిగిన ఆసామీలు చటుక్కున కుదిర్చేసుకున్నారు. సీతాపతికేమీ తోచలేదు. ఇంతవరకూ నీడపట్టున ఒకరి సంరక్షణలో తనని గురించి తాను ఆలోచించుకోవల్సిన అవసరం ఏమాత్రమూ లేని ఒక పరిస్థితిలో బతికిన సీతాపతికి ప్రాక్టికల్‌గా బతికే ఆలోచించే అలవాటు పూర్తిగా తప్పిపోయింది.

కొందరు వర్షంలో గొడుగులు వేసుకునీ, కొందరు తడుస్తోనూ వెళ్ళిపోయారు. మరికొందరు లోపలే నిలబడిపోయారు. నాలుగుమైళ్ళ దూరం వర్షంలో నడిచి వెళ్ళడం అసాధ్యమూ, అవివేకమూ అనుకున్నాడు సీతాపతి. ఏం చేయాలా అని ఆలోచిస్తూ చూరునుంచి ధారలు ధారలుగా కారుతూన్న వాననీటిని చూస్తూ నిలబడ్డాడు.

"బాబూ, మీరెక్కడికి వెళ్ళాలి?"

ఎవరా అని తిరిగి చూశాడు. తన పక్కనే ఓ కుండలాల బ్రాహ్మణ వృద్ధుడు నిలబడి ఉన్నాడు.

ఫలానా ఊరని చెప్పాడు సీతాపతి.

"నేనూ అక్కడికే వెళ్ళాలి, ఎవరింటికి వెడతారు తమరు?" అన్నాడు వృద్ధుడు. సీతాపతి ధరించిన పల్చని పొందూరు పంచెనీ, తెల్లగా మిస మిసలాడే సిల్కు లాల్చినీ భక్తియుతంగా చూస్తూ.

"ఒక మిత్రుని యింటికి-" ముక్తసరిగా చెప్పాడు సీతాపతి తన ఆలోచనలు పద్మ వైపు పోతూండగా.

కొంతసేపటికి వాన తగ్గింది. వృద్ధుడు గౌరవంగా "వాన తగ్గింది బాబూ, తుంపరకేం లెండి, ఇలాగ కూర్చుంటే రాత్రంతా యిక్కడే జాగారం చెయ్యాలి. రండి అడుగేస్తూ వుందాం, అరగంటలో మనఊరు వెళ్ళిపోవచ్చును" అన్నాడు.

సీతాపతి సమ్మతించి వృద్ధుడితో బయలుదేరాడు. మబ్బుల మూలాన చీకటి ఎక్కువగా వుంది. వృద్ధుడు తనని గురించి

గిరికథ

ఆదిభట్ల నారాయణదాసుగారు ఒకనాడు హరికథా కాలక్షేపం ప్రారంభిస్తూ "ఇవాళ హరికథ చెప్పనా? గిరికథ చెప్పనా?" అని నవ్వుతూ అడిగారట.

వెంటనే ఒక పెంకిఘటం "గిరికథ చెప్పండి చూదాం" అన్నాడట. దాసుగారు వో చిరునవ్వు విసిరి, "పార్వతీ పరిణయం" కథంతా ఆశువుగా చెప్పడం ప్రారంభించారు.

—సుకుమార్

చెప్పుకు పోతున్నాడు. ఆ ఊరి కోవెలకి తాను పూజారిననీ. కోవెలనే అనుకుని వున్న సత్రానికి యాజమాన్యం కూడా తనదేననీ. తనకి పిల్లలు లేరనీ. బంధువుల పిల్ల నొకదాన్ని పెంచుకుంటున్నాననీ. దానికి పెళ్ళి చేయాల్సిన బాధ్యత వొకటి తనమీద ఉందనీ....

సగం దూరం వెళ్ళేసరికి వర్షం దబదబ మొత్తింది. హోరున కురిసే వర్షంలో యిద్దరూ గబగబా నడవడం మొదలు పెట్టారు.

గుబులు గుబులుగా బయలుదేరింది. పద్మ కళ్ళు ఆత్రంగా బాధగా చూస్తున్నట్టు అనిపించి చలించిపోయాడు. కాని మళ్ళీ ధైర్యంగా, మొండిగా ఊపిరి బిగించి నడవసాగాడు.

ముసలాయనికి ప్రతిరోజూ సూర్యోదయాత్పూర్వం ఎంత చల్లని నీళ్ళల్లో అయినా మునిగే అలవాటేమో, ఈ వర్షం పిసరైనా బాధించలేదు. అయితే ఆయన ఆందోళనల్లా చంకలో తడిసిపోతూన్న మూట గురించి మాత్రమే.

“అనుకున్నంత పనీ అయింది” అని సాగదీశాడు బ్రాహ్మణుడు వానమీద కోప్పడుతూ.

సీతాపతి తడిసిపోయాడు. పూర్తిగా మొత్తంగా, ఘోరంగా తడిసిపోయాడు. పంచె, లాల్చీ వొంటికిపట్టుకుని పోయాయి. పాపం చన్నీళ్ళ స్నానమైనా ఎప్పుడూ అలవాటు లేదతనికి. లోపల్నుంచి చలి

ఊరు చేరుకునేసరికి వర్షమూ తగ్గింది. విద్యుద్దీపాలు మందకొడిగా మెరుస్తున్నాయి. సీతాపతికి ఉత్సాహం వచ్చింది.

“రామకోటి యిల్లు తెలుసునా తాతగారూ మీకు ?” అని అడిగాడు.

“రామకోటి అంటే ?”

వివరించి చెప్పాడు సీతాపతి.

“అయ్యో నాయనా. ఈ ఊళ్ళో పొలమూ

యిల్లూ అమ్మేసి పట్నం వెళ్ళిపోయాడు. రామకోటి తండ్రి పోగానే. మీకు తెలియదూ బాబూ”

సీతాపతి నెత్తిన పిడుగు పడినట్లయింది. ఏ ఆశతో వచ్చాడో ఆ ఆశ సమూలంగా పెకలింపబడి నట్లయింది. అతనికి కాళ్ళాడ లేదు. మళ్ళీ కడుపులోంచి వొణుకు వచ్చింది.

”అయితే ఎలాగ ఈ రాత్రికి ? ఎక్కడ బస చెయ్యాలో ఏమో....” తనలో తనే గొణుక్కున్నాడు సీతాపతి.

“ఎంతమాట ! ఎంతమాట ! మీకు లోటు రానిస్తానా ! సత్రంలో బస చేద్దురుగాని” అన్నాడు పూజారి.

ఆఊరు పల్లెటూరయినా మంచి రోడ్లతో పెంకుటిళ్ళతో అక్కడక్కడ మేడలతో సుఖంగా ధనవంతంగా కనపడింది. విద్యుద్దీపాలు వుండడం వలన ఊరికి ఒక సందడి వచ్చినట్టుంది. పూజారి వెనకనే వొణుకుతూ సీతాపతి సత్రానికి వెళ్ళాడు.

సత్రంలో ఓ గదిలో ఒక పొడుగాటి మొద్దు బల్లమీద పరుపు అని పొరపాటుగా అనుకొనబడే ఒక వస్తువు నొకదాన్ని పరచి, దానిమీద ఓ దుప్పటీ వేసి పక్క తయారు చేశారు పూజారి కుటుంబం. సీతాపతి భోజనం వద్దన్నాడు, కాని వాళ్ళు (భార్యా భర్తా) జమిలిగా బలవంతంచేయగా విధిలేక అంతకుముందే వాళ్ళిచ్చిన బట్టలు కృతజ్ఞతతో ధరించిన సీతాపతి భోజనానికి లేచాడు. మేకులలాంటి ఎర్రన్నమూ, ఊరగాయా, కూరా రుచి చూసేసరికి తాతలు కనిపించారు సీతాపతికి. వాటిని నమలడం ఒక భారీ పరిశ్రమగా, ముద్ద గొంతు దిగడం ఓ గండంగా గడిచింది. నిజానికి అతనికి ఆకలిగాలేదు. అయినా తినకపోవడం -అంత బతిమాలినప్పుడు - బావుండదనుకున్నాడు. ఒకరు చెప్పినట్టు చేసే ప్రకృతి అతనిలో స్థిరపడి పోయింది. భోజనం చేస్తూ సీతాపతి అడిగాడు. “ఈ ఊళ్ళో ట్యూషన్లు ఏమైనా మంచివి దొరుకుతాయాండీ ?”

ముసలాయనా, భార్యా తెల్లబోయి ఒకరినొకరు చూసుకున్నారు. సీతాపతి ధనవంతుడన్న వారి అభిప్రాయాన్ని యీ ప్రశ్న చెదరగొట్టింది. ఇతనివాలకమూ, దుస్తులూ, వొంటి మిస మిసా, వేళ్ళని రాళ్ళుపొదిగిన రెండు ఉంగరాలూ—యివన్నీ బ్రతుకు తెరువులేని ఒక ప్రైవేటు మేష్టారి తాలూకని నమ్మడం కష్టంగా వుంది. అయినా ముసలాయన తిరిగి ప్రశ్నించగా, ట్యూషన్లే యిక తన జీవనాధారం అని జవాబిచ్చాడు సీతాపతి. ముసలాయన మనస్సులో చటుక్కున గొప్పవూహ మెరిసింది. ఇతడు సామాన్యుడే అయితే ఎదిగిన తన కూతురునిచ్చి పెళ్ళిచేసి యింట్లో వుంచుకుంటే....? ఎదిగిన ఆ పెంపుడుకూతురే యిప్పుడు వద్దన కావిస్తోంది. పళ్ళు కొంచెం ఎత్తూ, కళ్ళు కొంచెం చిన్నవీ అయినా భారీగా కన్నుల చెదిరేటట్టుగా వుంది. ముసలాయనకీపిల్ల - సుబ్బలక్ష్మి అంటే ఎంతో ప్రేమ.

“ట్యూషన్లా ! వాకబు చేద్దాం నాయనా. నలుగుర్నీ అడిగి తెలుసుకుంటాను. ఇంతకీ మనదేఊరు నాయనా.”

తాపతి సరిగా జవాబివ్వలేదు. మళ్ళీగ

చల్లగా కడుపులోపడేసరికి మళ్ళీ ఆకలి వచ్చింది. ఎలాగో కళ్ళుమూసుకు తినేసి గదిలోకి వెళ్ళి పడుకున్నాడు. సుబ్బలక్ష్మి వచ్చి కంచెంబుతో నీళ్ళు అతని పక్క దగ్గర పెట్టి వెళ్ళిపోయింది.

తెల్లవారి లేచేటప్పటికి సీతాపతికి కళ్ళు మంటలుగానూ, వొళ్ళు నొప్పులుగానూ వుంది. అప్పటికే ముసలాయన మూడు సార్లువచ్చి చూశాడు సీతాపతి లేచాడేమో నని. రాత్రి ఆయన భార్యతో సంప్రతించాడు. సీతాపతిని అల్లుణ్ణి చేసుకునే విషయమై -

"కుర్రవాడు బుద్ధిమంతుడూ, మంచివాడూ. నా అనేవాళ్ళెవరూ లేనివాడూ అయివున్నాడు. కట్నం ఏమీ అడగడు బహుశా. అడిగినా యిచ్చుకొనే స్థితిలో మనం లేంకదా. ఏమంటావ్ ?" అన్నాడు.

"సెబాస్" అంది ముసలావిడ.

చాటుగా యీ సంభాషణని ఆలకించిన సుబ్బలక్ష్మికి వొళ్ళంతా విద్యుత్తు పాకినట్టయింది. సిగ్గు దొంతరలు దొంతరలుగా వొళ్ళంతా వ్యాపించింది. ఈ పెంపుడుతండ్రి తనకింక పెళ్ళి చేయగలడనే నమ్మకమూ, ఆశా లేదు ఆమెకి. దిగులుగావుంది. ఇప్పుడు వయస్సులో కొంచెం పెద్దవాడైనా, అందగాడైనవాడూ, చదువుకున్నవాడూ భర్తగా దొరుకుతాడన్న ఆశ ఆ వర్షా కాలంలో ఆమె గుండెల్లో వసంతాగమాన్ని సూచించింది.

సీతాపతి కళ్ళు తెరచి మళ్ళీ మూసుకున్నాడు. అతనికి వొళ్ళు స్వాధీనంలో ఉన్నట్టు లేదు. ఊరికే కళ్ళుమూసుకుని నిద్రపోవాలని వుంది. ఏదో కొత్తగా, చిరాకుగా వుంది. ట్యూషన్లు మంచివి సంపాదించుకోవాలన్న తహ తహ మనస్సులో ఎక్కువైపోతోంది. గది కిటికీలోంచి ఎండ నేలమీదకి పాకింది.

"నాయనా. లేచావా ?" అన్నాడు నాల్గోసారి వచ్చిన ముసలాయన.

సీతాపతి లేచి కూర్చున్నాడు.

"అమ్మాయి నీకు కావల్సినవన్నీ చూస్తుంది బాబూ. మొహమాట పడకు. ఇది నీ యిల్లే అనుకో." అన్నాడు ముసలాయన.

"అలాగేనండి."

కాసేపట్లో "కాఫీ తీసుకురానాండీ" అన్న సన్నని గొంతుక తలుపుచాటునుంచి వినపడింది. ఉలిక్కిపడి తలెత్తాడు. సుబ్బలక్ష్మి ఎడం జబ్బా, చీర కుచ్చెళ్ళూ కనపడుతున్నాయి.

"ఊఁ" అన్నాడు సీతాపతి.

సుబ్బలక్ష్మి యిచ్చిన కాఫీ నోట్లో పోసుకుని తెల్లబోయి ఆమెకేసి చూశాడు.

నిర్వచనం

రెండవ బహుమతి కథ : పాఠకుల దృష్టిలో మొదటి బహుమతికి తగిన కథ.

"ఏమిటిదీ ?" అన్నాడు.

"కాఫీ అండి."

ఈ ద్రవాన్ని ఏమని పిలిచినా అతనికి బాధలేకపోవును. కాని బాధనీ కాఫీనీ గుటక వేశాడు తప్పని సరిగా.

"బావులేదా ?" అంది పెళ్ళికూతురు సిగ్గుగా.

"బావుంది" అన్నాడు. అరుచిని నోట్లో అనుభవిస్తూ-

"మరికాస్త కలిపి తీసుకురానాండీ"

"వద్దు వద్దు" అన్నాడు కంగారుగా.

"ఊఁ....." అన్నాడు సీతాపతి. ఈ కించిత్పరిచిత కన్యమీద అతని హృదయం కృతజ్ఞతతో నిండిపోయింది.

సీతాపతి ఊళ్ళోకి వెళ్ళి రామకోటిని గురించి, ట్యూషన్ల గురించీ వాకబు చేదామనుకున్నాడు. ఈ పూజారియింట్లో తిష్ఠ వేయడం ఎంత నిర్లజ్జాకరమో అతనికి తెలియకపోలేదు. మంచంమీదనుంచి లేచాడు. గుమ్మం వరకూ వచ్చాడు. తల తిరిగింది. కణతలు టక టక కొట్టుకున్నాయి. ఒళ్ళు వణికింది. వెనక్కి వాలిపోయాడు మంచం

కాఫీ తాగి తలెత్తి చూశాడు. తలుపు చాటునే వుందామె.

"మీరింక బట్టలేమీ తెచ్చుకోలేదా ?"

"లేదు—" సీతాపతికి తన పొరపాటు తెలిసింది. కట్టుబట్టలతో యిల్లువదలి వచ్చేశాడు.

"రాత్రి విప్పేసిన మీ పంచె, లాల్చీ ఉతికిపెట్టనా ?" అంది సుబ్బలక్ష్మి సీతాపతి రేగిన జుట్టునీ, తెల్లని వొంటినీ చూస్తూ ఆప్యాయంగా.

మీద. తనకి తీవ్రంగా జ్వరం—రాత్రి వానలో తడిసిన కారణంగా వచ్చిందని తెలుసుకున్నాడు. హతాశుడై పోయాడు. బెదరిపోయాడు కూడా. మెత్తని పరుపులతో మంచమూ, డాక్టర్లూ, నౌకరూ, వీళ్ళందరిపైనా వేయికళ్ళతో కనిపెట్టే పద్మా మనసులో మెదిలారు. అయితే తన ఈ పరిస్థితికి పద్మే కారణం అని తీర్మానించుకున్నాడు. అతనిలో పద్మ మీద కసి విపరీతంగా పెరిగిపోయింది. రాత్రి జేబులోనే తడిసిన డైరీ తలవేపునుంచి తీశాడు.

తెరిచాడు. తడి తడిగావున్న ఒక పేజీ మీద యిలా రాశాడు.

"పద్మ రాక్షసి."

అతని మనస్సులో ఒక్కసారిగా అతనికే జాలి కలిగింది. అతనికి చచ్చిపోవాలనిపించింది. అప్పటికి కాని పద్మకి పశ్చాత్తాపం కలగదు. పశ్చాత్తాపం ఎందుకు కలగాలో అతను స్పష్టంగా ఆలోచించలేదు. కాని కలగాలని మాత్రం అనుకున్నాడు. అతని కళ్ళు తడి అయాయి. సీతాపతి అనే ఉత్తముడికి కలగవల్సిన కష్టాలు కావు, యిటువంటివి అని నవ్వ చెప్పుకున్నాడు. మళ్ళీ డైరీలో యిలా రాశాడు

"ఒకవేళ నేను చచ్చిపోతే—కాకినాడ సూర్యారావుపేటలో వున్న నా భార్య అనగా పద్మాదేవి యింటో వున్న నా తాలూకు స్వంత ఆస్తి అయిన పుస్తకాలు ఏదేనా గ్రంథాలయానికి నా పేర నివ్వవల్సింది."

భోజనం వేళకి పూజారి వచ్చిచూశాడు. సీతాపతి అస్వస్థతకి ఎంతో ఆతృత కనపరిచాడు. భార్యతో కలిసి ఆలోచించి సుబ్బలక్ష్మిచేత మిరియం, వాము మొదలైన వాటితో కషాయం తీయించి ముగ్గురూ సీతాపతి దగ్గరకు వెళ్ళి తాగమని బలవంతం చేశారు. దీనంగా చూశాడు సీతాపతి దేవుడి దిక్కువైపు. తేనె, గ్లూకోజూ, పళ్ళరసం లాంటి అనుపానాలు లేకుండా అతను తలనొప్పి మాత్ర అయినా మింగలేదు. ముసలాయన ఆదేశంతో, సుబ్బలక్ష్మి తలాపి దిక్కున కూర్చుని సీతాపతి తల ఎత్తి నోట్లో చప్పున పోసింది కషాయం. సుబ్బలక్ష్మికి వొళ్ళంతా పులకలూ, సీతాపతికి చెమటలూ పట్టాయి.

"నీకు దగ్గరవాళ్ళెవరేనా ఉన్నారా నాయనా. కబురంపనా" అన్నాడు ముసలాయన.

"లేరు" అన్నాడు సీతాపతి.

ముసలాయన కోరుకుంటున్నదీ యిదే. నలుగురున్నవాడూ, నాలుగూ వున్నవాడూ తనకి అల్లుడయేందుకు సులువుగా అంగీకరించడని ఆయనకి తెలుసును. కోవెలలో అర్చకుడిగా తానిన్నాళ్ళూ చేసిన సేవకి భగవానుడి అనుగ్రహం ఈ సీతాపతి రూపంలో కలిగిందని నమ్మకం కలిగింది ఆయనకి.

"అయితే నువ్వొంటరివాడివే అన్నమాట. సంసారమూ, జంజాటమూ ఏవీ లేవన్నమాట."

"నాకెవ్వరూ లేరండీ—ఎవ్వరూ...." నొక్కి పలికాడు సీతాపతి. అతని కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

ముసలాయన ముసలావిడకేసి, ముసలావిడ సుబ్బలక్ష్మి వైపూ సాభిప్రాయంగా చూపుల్ని బట్వాడా చేశారు. సుబ్బలక్ష్మి సిగ్గుపడింది.

"జ్వరం తగ్గిపోతుంది నాయనా. జలుబున వచ్చి వుంటుంది. ఏమీ కంగారుపడకు

● ఫ్యాక్టరీని తనిఖీ చేయడానికి వచ్చిన ఇన్‌స్పెక్టరు మేనేజరుతో:— "మీ ఫ్యాక్టరీలో ఎంతమంది పనిచేస్తున్నారండీ ?"
మేనేజరు: "సగం మందండి."

నీకేలోటూ రానివ్వను. ఇంక ట్యూషన్లన్నావూ—బోలెడు దొరుకుతాయి. జ్వరం తగ్గాక యిద్దరం కలసి పెద్దలందర్నీ కలుసుకుందాం. ఈ సత్రం పసారాలోనే చదువుకునే పిల్లల్ని పిలిచి పాఠాలు చెప్పొచ్చును. దివ్యంగా వుంటుంది" అని భరోసా యిచ్చాడు పూజారి.

సుబ్బలక్ష్మి సీతాపతికి ఎప్పుడు ఏం అవసరమో అని ఆ గది చాయలనే రోజంతా తిరుగుతోంది. సాయంత్రం పూజారి వచ్చి మళ్ళీ కషాయం యిప్పించాడు. ఈసారి ఏవో ఆయుర్వేదపు మాత్రల్ని కూడా మింగించాడు. రాత్రికి జ్వరం ఎక్కువైంది. వొళ్ళు నొప్పులూ ఎక్కువయ్యాయి. సీతాపతి పూజారితో నీరసంగా యిలా అన్నాడు.

"ఖర్చులకి భయపడకండి. నా వేలి ఉంగరాలు రెండూ మీరు తీసుకోండి. ఒక ఇంగ్లీషు వైద్యుడిని పిలిపించండి. తెలుగు మందులు నాకు పడవు తాతగారూ."

"ఎంత మాట, ఎంతమాటన్నావు నాయనా. ఈమాత్రం దానికి మేం చెయ్యలేమూ. మేమేమైనా పరాయివాళ్ళమా. రేపు పుదయమే వస్తుల్కాను డాక్టర్ని తీసుకొస్తాను. ఆంజనేయులు సామాన్యుడుకాదు. గొప్ప హస్తవాసి ఉన్నవాడు. ఒక్క యింజక్షన్ యిచ్చాడా. జ్వరం పిలక పుచ్చుకుని లాగినట్టు చచ్చిన దిగిపోతుంది.

సీతాపతి తల వూపి కళ్ళు మూసుకున్నాడు.

"చూడు నాయనా. నీతో మనసులో మాట చెప్పక పోవడమెందుకూ ? మా సుబ్బలక్ష్మి వుంది చూడు మహాఉత్తమురాలు. దానికి పెళ్ళిచేసే బాధ్యత నాదేకదా. పిల్లకి పెళ్ళిచేసి పిల్లనీ, అల్లుణ్ణీ యింట్లో పెట్టుకొని వాళ్ళని చూసుకుంటూ రామా కృష్ణా అంటూ కాలక్షేపం చేయడమే నా అభిమతం. నీకూ ఎవరూ లేరు. సుఖంగా యిక్కడే వుండిపోవచ్చును. మా పిల్ల వొళ్ళు దాచుకునే మనిషి కాదు. శ్రద్ధగా నిన్ను కనిపెట్టుకుని యింటి పనులన్నీ దివ్యంగా చూసుకుంటుంది. నెలకి వంద తక్కువ రాకుండా నీకు ట్యూషన్ల మీద జీతం వచ్చేటట్టు చూసే పూచీ నాది. ముప్పై యేళ్ళు పైగా యీ పూజాపునస్కారాలు చేస్తూ నలుగురిలో ఓహో అనిపించుకున్నానే కాని వేరు కాదు! మా అల్లుడు చదువుకున్నవాడు. పాఠాలు చెప్తాడు అంటే ఎగిరి గంతేసి వస్తారు. ఏమంటావ్ పిల్లదాని వొంటిమీద రెండుతులాల బంగారం వుంది. కడుపున కన్న పిల్లలా చూసుకుంటున్నాం నాయనా. అంగీకారమేనా నీకు ?"

ముసలాయన ఉండబట్టలేక తన అభిలాషని తెలియజేశాడు. సీతాపతి ఊఁ అంటే ఆయన జీవితాన్ని వేధించే ఒకే ఒక సమస్యకి పరిష్కారం దొరికి శాంతి సుఖాల్ని పొందగలడు. సీతాపతి చెప్పినదంతా విన్నాడో లేదో తెలియదు. జ్వర తీవ్రత, తలనొప్పి, మనసులో తెలియనికసి, దాని పక్కనే కొండంత దిగులూ— యిన్నింటితో మనస్సు మనస్సులో లేని ఒక దయనీయ పరిస్థితిలో వున్నాడు. ముసలాయన ఏమంటావ్ నాయనా అని మళ్ళీ రెట్టించి అడగ్గానే తల వూపాడు. ఎందుకు వూపాడో సీతాపతికి తెలియనే తెలియదు. కాని పూజారి

మొహంలో సంతోషపు వెల్తురు అలము కుంది.

సుబ్బలక్ష్మి వింటూండగా భార్యతో సీతాపతి అంగీకారాన్ని తెలిపాడు పూజారి. ఆవిడ సుబ్బలక్ష్మిని కౌగలించుకొని బుగ్గలు పుణికి దీవనలు కురిపించింది.

మూడవరోజు ఉదయం—శీతాపతి యిల్లు వదలి రెండురోజులు పూర్తి అయాయి-ఉత్సాహంలాంటి లేత ఎండ ఇళ్ళమీదా, చెట్లమీదా, పొలాలమీదా, శీతాపతి పడుకున్న కిటికీ అంచులమీదా సమబుద్ధితో ప్రసరించినా గ్రామం అంతా చైతన్య కోలాహలంలో మునిగివున్నా, సుబ్బలక్ష్మి తల దువ్వుకుంటూ పాటలు పాడుకుంటూన్నా, ఒక్క శీతాపతి మాత్రం ఆ ఆనందాన్ని పంచుకోలేక పోయాడు. పైగా బరువుగా మూలిగాడు. జ్వరం ఏమాత్రం తగ్గలేదు. అతనికి వొంటిమీద ఎవరో కాల్చిన ఇనుప కడ్డీలతో వాతలు పెడుతూన్నట్టు వుంది. సుబ్బలక్ష్మి తీసుకొచ్చి యిచ్చిన కాఫీ చేదుగా హాలాహలంలా వుంది. మరి కాసేపటిలోనే పూజారి యింగ్లీషు వైద్యుడు ఆంజనేయులిని తీసుకొచ్చాడు.

"చూడు నాయనా, డాక్టరుగారు వచ్చారు" అన్నాడు పూజారి.

శీతాపతి కళ్ళు తెరిచాడు. ఎదురుగా పంచెకట్టుమీద రంగుచొక్కా, దానిమీద ఇంకో రంగుకోటూ, చేతిలో స్టెదస్కోపూ, మరోచేతిలో మందుల సంచితో ఆంజనేయులు కనుపించాడు. గుబురుగా పెరిగిన కనుబొమ్మలూ, లావాటి పెదవులూ, సగం బట్టతలా, సన్నంగా మనిషి, చాలా అసందర్భంగా వదులుగా వున్న అవయవాలూ—శీతాపతి నీరుకారి పోయాడు.

ఆంజనేయులు నవ్వుతూ "మీకు ఏ వైద్యం కావాలి." అని అడిగాడు.

ప్రశ్నార్థకంగా చూశాడు శీతాపతి.

"ఆంజనేయులుగారు యింగ్లీషు వైద్యమొక్కటే కాదు నాయనా. హోమోపతి, ఆయుర్వేదం, యునానీలో కూడా సిద్ధహస్తులు. ఏమైనా ఇంగ్లీషు వైద్యానికే గిరాకీ యిక్కడ. నాలుగేళ్ళ పట్నంలో కాంపౌండరుగా వుండి వైద్యంలోని మెలకువలన్నీ గ్రహించేశారు. మహా సూక్ష్మబుద్ధి. గ్రామం అంతా వైద్యానికి వీరిమీద ఆధారపడి వుంది. పది పదిహేనేళ్ళ అనుభవం వుంది".

శీతాపతి నిస్పృహతో తల వూపాడు. కాకినాడలో పెద్దడాక్టర్లందరూ ఈపాటికి తన పాదాలదగ్గరుండేవారు కదా అని లోపలే వాపోయాడు.

ఆంజనేయులు భయం లేదని చెప్పి మాత్రలిచ్చి, తగ్గకపోతే యింజీషన్ (అంజనేయులు అలాగే వుచ్చరిస్తాడు.) యిస్తానని చెప్పి వెళ్ళిపోయాడు.

మధ్యాహ్నం వేళకి శీతాపతికి నీరసంగా ఆకలిగా అనిపించింది. గుమ్మం అవతల సుబ్బలక్ష్మి కుంపటి అంటించి శీతాపతి తాగడానికి వేడినీళ్ళు కాస్తోంది. "అమ్మాయ్" అని పిలిచాడు. సుబ్బలక్ష్మి పవిట సవరించుకొని కాస్త దూరంలో నిలబడింది.

"నాకు ఆకలేస్తోంది" అన్నాడు మెల్లగా.

"కాఫీ కాచి తీసుకురానా ?"

"వద్దు. నాకు తినేందు కేమైనా కావాలి"

"అయ్యబాబోయ్. అన్నం తినకూడదు. లంఘణం వుండాలన్నాడు నాన్న."

"పోనీ అన్నం వద్దు—ఇంకేమైనా...." బతిమాలుతూ చూశాడు శీతాపతి.

"జంతికలున్నాయి."

"కాసిని తెచ్చిపెట్టు."

తట పటాయించింది సుబ్బలక్ష్మి.

"ఎవరికీ చెప్పొద్దు. ఏంవేళా తింటేకాని నాకు జ్వరం తగ్గదు."

సుబ్బలక్ష్మి చాటుగా రెండు రోజుల క్రితం చేసి డబ్బాలో దాచిన జంతికల్ని భక్తియుతంగా శీతాపతి చేతిలో పెట్టింది. కరకర నమిలి గ్లాసుడు మంచినీళ్ళు తాగి నిద్దరపోయాడు శీతాపతి. పద్మ వుంటే పండో, రొట్టె (బ్రెడ్) గాని యిచ్చివుండేది. కాని ఆ సదుపాయాలు యిక్కడ వీళ్ళకి తెలియవు, అర్థంకావు. అనుకున్నాడు శీతాపతి.

శీతాపతికి మెలకువ వచ్చేసరికి చీకటి పడుతోంది. అతనికి తల పోటుగా, దిమ్ముగా వుంది. వొళ్ళు కాలిపోతోంది. అతనికి పరిసరాలూ, పరిస్థితులూ అన్నీ మసకగా వున్నాయి. ఆంజనేయులు వచ్చి జ్వరం చూసి నూటనాలుగు డిగ్రీలుందనడం, ముసలాయన ఆతృతగా ఏవేవో అనడం, సుబ్బలక్ష్మి తడిగుడ్డ తలమీద వేయడం-ఇవన్నీ ఎక్కడో ఎవరినిగురించో జరుగుతూన్నట్టు వుంది శీతాపతికి.

రాత్రి శీతాపతి పక్కగానే తన పక్క వేయించుకున్నాడు ముసలాయన. సుబ్బలక్ష్మి తలాపి దిక్కున కూర్చుని తల రాస్తోంది. ముసలావిడ భయం భయంగా గుమ్మం అవతల కూర్చునివుంది. శీతాపతి అశాంతిగా నిద్రలోనే దొర్లుతున్నాడు. కలవరిస్తున్నాడు. పద్మ అంటున్నాడు. హత్య అంటున్నాడు. సందర్భంలేని ఆ మాటలకి అందరూ హడలిపోతున్నారు.

"సంధి లక్షణాలేమో" అంది ముసలావిడ.

"ఆంజనేయులుగార్ని పిలుచుకొస్తాను" అంటూ ముసలాయన కంగారుగా వెళ్ళాడు.

సుబ్బలక్ష్మి కనుకొలకులలో నీరు నిండింది. అయిదారేళ్ళనుండి తండ్రి తనకి వివాహప్రయత్నాలు చేసి చేసి విఫలుడయ్యాడు. ఇన్నాళ్ళకి—యిన్నేళ్ళకి తనకి మొగుడంటూ ఒకడు దొరికే అదృష్టం కలిగి—యింతలోనే వంచింపబడడంలోని అవమానమూ, బాధా ఆమెని దహించివేస్తున్నాయి. మనసులో వేయి దేవుళ్ళకి మొక్కుకుంది.

ఆంజనేయులు వచ్చి చూసి యింజక్షను యిచ్చి ఫరవాలేదని చెప్పి వెళ్ళాడు. ముసలాయన మెలకువ వచ్చిన శీతాపతికి ధైర్యం చెప్పాడు శీతాపతికి. మళ్ళీ నిద్రపట్టింది. నిద్రలో మళ్ళీ కలవరింతలు....

తల పట్టుతూన్న సుబ్బలక్ష్మికి తలగడ కింద డైరీ చేతికి తగిలింది. "ఏదో పుస్తకం నాన్నా" అంటూ తండ్రికిచ్చింది. ముసలాయన కళ్ళజోడు సవరించుకొని డైరీ పేజీలు పరిశీలించాడు. దీపకాంతిలో వేగంగా మారుతూన్న ఆయన ముఖ కవళికల్ని సుబ్బలక్ష్మి, తల్లీ తదేకంగా పరికిస్తున్నారు.

మేష్టారు:- "సింహళం ఎక్కడుంది ?"
పుత్రాడు:- "ఇండియాకి అరంగుళం దిగువ నుందండి."

ముసలాయన ముఖంలో భయం ఆశ్చర్యం పెనవేసుకున్నాయి.

"ఏమేవ్. ఏది నా అంగవస్త్రం యిలా పడెయ్యి." అన్నాడు తొందరగా.

"ఏం జరిగిందీ?" అంది ముసలావిడ కంగారుగా.

"ఒంటిగంటకి కాకినాడ వెళ్లే బండివుంది నేను వెళుతున్నాను. ఇతగాణ్ని జాగ్రత్తగా చూస్తూవుండండి. అవసరమైతే ఆంజనేయుల్ని పిలవండి." చెప్పులు తొడుక్కుని గుమ్మంవరకూ వెళ్ళాడు పూజారి.



"ఇంత రాత్రివేళ ఈ ప్రయాణమేమిటీ. అసలేం జరిగిందీ అంట?'

"ఇతగాడికి యిల్లూ వాకిలీ అన్నీ వున్నట్టే కనపడుతున్నాయి. కలవారి కుటుంబంలోంచి వచ్చాడు. నేను ముందే అనుమానించాను. ఇక్కడ ఏ ప్రమాదం జరిగినా పీకలమీద కొస్తుంది. ఏ క్రిమినల్ కేసో వచ్చి జైల్లో కూర్చుంటాం."

పూజారి మళ్ళీ జాగ్రత్తగా శీతాపతిని సంరక్షిస్తూ వుండమని హెచ్చరించి వెళ్ళిపోయాడు. నోరావలించి చూస్తూ వుండిపోయారు భార్యాకూతురూ. ఇల్లూ వాకిలీ అన్నాడేకాని భార్య వుందా లేదా అన్న సందేహంతో సతమతమౌతూంది సుబ్బలక్ష్మి.

మరునాడు మధ్యాహ్నం వేళకి శీతాపతి చుట్టూ కూర్చున్న ఆంజనేయులూ, సుబ్బలక్ష్మి, ముసలావిడ మ గుమ్మంముందు కారుచప్పుడు విని ఆతృతగా వచ్చారు. ఒక పెద్ద టాక్సీ ఆగివుంది గుమ్మంలో. పూజారి ముందుగా దిగాడు. వెనకాలే పద్మ, పద్మ తర్వాత స్టెదస్కోపు చేత్తోపట్టుకొన్న ఫామిలీ డాక్టరూ, గుమాస్తా గోవిందయ్యా దిగారు. గోవిందయ్యా, డ్రైవరు కలిసి రెండు మూడు బుట్టల సామానూ, హోల్డాలూ వగైరాలు దింపారు.

"ఎలావుంది ఆయనకి?" ముసలావిడని అడిగింది పద్మ. ఆ గొంతులో ఆతృత, వేదనా యుగ యుగాల్నీ దశదిశల్నీ చీల్చుకు పోగలదు.

"శీతాపతిగారి ధర్మపత్ని పద్మావతీదేవిగారు వీరు. అలా రాయిలా నిలబడ్డావేం—లోపలికి తీసుకువెళ్ళు" అన్నాడు పూజారి భార్యతో.

"రండమ్మా రండి—" అంది. అప్పటికి అర్థమై తేరుకున్న ముసలావిడ. "మీ ఆయనకేం భయంలేదు. ఇంక మీరే వచ్చారుగా."

ఆంజనేయులు పెద్ద డాక్టరు రావడం చూసి ఏ సందులోంచి ఏనిముషంలో జారిపోయాడో ఎవరికీ తెలియదు.

శీతాపతి నీరసంగా కళ్ళెత్తి చూశాడు. ఫామిలీడాక్టరు పరీక్ష చేస్తున్నాడు. తన తల ఏదో పరిచితమైన మెత్తని తొడమీద ఆనించి వుండడం గ్రహించాడు. కళ్ళెత్తి పైకి చూశాడు. పద్మ — నీరసించి కృశించిన విదియచంద్రుని రేకలాగా, వడలిన రాలిన పువ్వురేకులా—తన తలనే నిమురుతోంది. ఆమె కన్నుల వెంబడి సంతత బాష్ప స్రవంతి చెక్కిళ్ళనీ, పవిటనీ తడిపి వేస్తోంది.

శీతాపతి మొహంలో చటుక్కున ఏదో కాంతి, కాంతిసంతంగా అలముకుంది. "వచ్చావా పద్మా,' అన్నాడు మెల్లగా.

రుద్ధమైన పద్మ కంఠంనుండి మాట రాలేదు. జవాబుగా తల వూపింది.

గోవిందయ్య బుట్టలు తెరచి పళ్లూ, గ్లూకోజూ, హార్లిక్సూ, మందులూ మొదలైన సరంజామాని గది అలమారాలో సర్దుతున్నాడు.

"మహాయిల్లాలు. సాక్షాత్తు లక్ష్మీదేవి. ఆమె ఎంత బెంగపడిపోయిందో, ఎంత మందిని ఎన్నిదిక్కులకు పంపించిందో,—ఓహోహో ఎంత అందమైన భవంతీ—నౌకర్లూ చాకర్లూ ఏం సిరీ ఏం సంపదా—నిష్కారణంగా యిల్లువదలి యీ వూరు రావడమేమిటీ విడ్డూరం కాకపోతే – ఇంకో రోజు ఆలస్యమైతే ఆవిడ ప్రాణాలే వదిలేసును—రామ రామ, ట్యూషన్లు చెప్పుకుంటానంటూ ఈయన దేవిరించడమేమిటీ" ముసలాయన మాటలోంచి మరోమాటలోకీ, భావంలోంచి మరో భావంలోకీ గంతులేస్తూ ఉత్సాహంగా చెపుతున్నాడు. వీరి సిరిసంపదలకీ, పద్మ పతిభక్తికీ ఆయన హృదయం గౌరవపూజ్య భావాలతో నిండిపోయింది.

సుబ్బలక్ష్మి ఎంతో నిరాశ చెందినా, పద్మ అందాన్ని చూసి లోపల్లోపల మెచ్చుకోకుండా వుండలేకపోయింది. ఇదంతా సినీమాలా, కలలా వింతగా వుంది ఆమెకు.

డాక్టరు గారు పరీక్ష పూర్తిచేసి, ఇది మామూలు ఫ్లూ జ్వరమనీ, జ్వరం కన్న మానసికాందోళన వల్ల ఎక్కువగా సీతాపతి బాధపడుతున్నాడనీ, భయపడవల్సిన అవసరం ఏమీ లేదనీ చెప్పాడు. పద్మ నిట్టూర్చింది.

"డాక్టరుగారూ, ఈయన్ని కదిపి మన వూరు తీసుకు వెళ్ళొచ్చునా—యింత జ్వరంలో."

డాక్టరు నవ్వాడు. "నువ్వు వచ్చాక యింకా జ్వరం ఎందుకుంటుందమ్మా. చల్లపడగానే సాయంత్రం బయలుదేరుదాం."

అన్నాడు.

"ఎంతమాట ఎంతమాట! ఈ పేదవాడి యింటికి రానే వచ్చారు. ఒక్కపూట ఆతిధ్యం స్వీకరించి నన్ను ధన్యుణ్ని చేసి—" అర్ధోక్తిలో ఆపాడు పూజారి.

గోవిందయ్య కలిపి ఇచ్చిన హార్లిక్సు తాగి పద్మ వొడిలో తలపెట్టుకుని నిద్ర పోయాడు సీతాపతి. గదిలో ఎవరూ లేరు. పద్మ మెల్లగా విసురుతూ కూర్చుంది. కానే పటికి సీతాపతికి మెలకువ వచ్చింది. దీర్ఘంగా ప్రేమగా చూశాడు పద్మవైపు.

"ఎందుకిలా చేశారు మీరు ?"—గద్గదికంగా అడిగింది పద్మ.

సీతాపతి ఏం జవాబివ్వలేదు

"ఇంకెప్పుడూ యిలా చేయనుకదా?"

సీతాపతి చెయ్యనని తల వూపాడు.

డాక్టరూ. సుబ్బలక్ష్మీ గదిలోకి వచ్చారు. సుబ్బలక్ష్మి చేతిలో పళ్ళెంలో పళ్ళూ, ఫలహారాలూ వున్నాయి.

"అమ్మాయ్. నువ్వి నాలుగు రోజులూ నిరాహారదీక్షతో వున్నావు. నీ భర్తకన్న నువ్వే నీరసంగా వున్నావు. కాస్త ఫలహారం తీసుకుని పాలు పుచ్చుకో." అన్నాడు డాక్టరు.

పద్మ డాక్టరు ఆదేశాన్ని పాలించింది. ఈలోగా సీతాపతి తలగడకింద వున్న డైరీ తీశాడు. మెల్లగా యిలా రాశాడు.

"పద్మ దేవత"

ఏం రాస్తున్నారా అని కొంచెం వొంగి చూసిన పద్మ తృప్తిగా నవ్వింది. ఎందుకో తెలియని సుబ్బలక్ష్మి నవ్వింది. డాక్టరూ నవ్వాడు.

సాయంత్రం భర్తతో వెళ్ళిపోయేముందు పద్మావతి పూజారి కుటుంబానికి తన కృతజ్ఞతను తెలియపరచింది. పూజారివల్ల కథ అంతా ఆమె ముందే వినివుంది. సమయానికి ఈ అర్చక మహాశయుడు తోడుగా లేనట్లయితే సీ తా ప తి ఏమై వుండేవాడో ఊహించటానికి కూడా ఆమె భయపడింది.

పూజారికి పూజారి భార్యకీ నమస్కరించి సుబ్బలక్ష్మి బుగ్గలు పట్టుకుని "నీకు మంచి మొగుడు రావాలని ఆశీర్వదిస్తున్నాను. నా భర్తలాంటి వాడిని కట్టుకున్నా సుఖపడేది ఏమీవుండదు. రాత్రీ పగలూ ఆయనకి ఎంతో సేవ చేశావు. లక్ష్మీ. నీ మంచితనం నీకు సౌ భా గ్యా న్ని చేకూరుస్తుంది. నీ పెళ్ళికి రాగలనో లేదో, ఇప్పుడే నీకు నా కానుక యిచ్చేస్తాను. నీ అక్కనీ. ఆమె ప్రేమనీ మరిచిపోకమ్మా." అంటూ మెడలోంచి రెండు పేటల గొలుసుతీసి సుబ్బలక్ష్మి మెడలో వేసింది.

పూజారి ఏదో అనబోయాడు. ముసలమ్మ ఏదో అనబోయింది. సుబ్బలక్ష్మి సిగ్గుగా తికమకగా చూసింది కాని ఏమీ వినకుండా పద్మ చరాలున కారులో కూర్చోవడమూ, బుర్రున కారు కదలడమూ జరిగింది. ●

హోదా

"ఎలా వుందోయ్ నీ కొత్త వుద్యోగం ?"
"ఉద్యోగానికేం ? నాకింద వందమంది పనిచేస్తున్నారు."
"నిజంగా ?"
"అవును. నేను పనిచేసేది మూడో అంతస్తులో."



మధురమైన సంగీతం వింటుంటే జన్మాంతర స్నేహాలన్నీ జ్ఞాపకం వస్తాయంటాడు మహాకవి కాళిదాసు.

రాజేశ్వరరావు సంగీతం వింటుంటే - పొదరింటినుంచి తొంగి చూచే చందురుడు, యమునా తటిపై శ్యామసుందరుని మురళి, ఆ తోటలోని అందగాడెవరే అని ప్రశ్నించే రాజకన్య, నీహార హార నీలాంబరధారిణి అయిన విభావరి. రాసలీలా మనోజ్ఞధామమైన బృందావనం ఇంకా ఎన్నెన్నో సృష్టిలోని అందమైన వస్తువులన్నీ మనల్ని పలకరిస్తాయి.

దాదాపు రెండు దశాబ్దాలనుంచి ఆంధ్రదేశంలో స్వరతరంపరగా పరవళ్ళు తొక్కుతున్న ఈ సంగీతలహరి వెనక దాగిన వ్యక్తిత్వం ఎటువంటిది ? అది వెలయించిన ఇంద్రధనుస్సుల వెలుగుల వెల ఏపాటిది ? దాని అనుభవసారం ఎంతటిది ? దాని మాధుర్య తీరం ఎక్కడ ?

పేజీ తిప్పండి !